సాక్షి ఆదిలాబాద్

బుధవారం ∣ 25 ∣ సెప్టెంబర్ ∣ 2024

కొనసాగుతున్న తనిఖీలు

ఆదిలాబాద్‌టౌన్: వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రైవేట్ ఆస్పత్రుల తనిఖీలు కొనసాగుతున్నాయి. వైద్యారోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ జాన్‌బాబు మంగళవారం జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ ఆస్పత్రులను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి వసతులపై ఆరా తీశారు. ఆయన వెంట ప్రోగ్రాం అధికారి నరేందర్ రాథోడ్, గజానంద్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

27న జాబ్‌మేళా

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్‌లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు గాను ఈనెల 27న ఉపాధికల్పన కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి మిల్కా ప్రకనటలో తెలిపారు. ఎంపికైన వారికి రూ.9వేల నుంచి రూ.12వేల వరకు వేతనం ఉంటుందని పేర్కొన్నారు. 18 నుంచి 30 ఏళ్లలోపు వారు అర్హులని తెలిపారు.

గరిష్ఠం/కనిష్ఠం
31.0/25.0

వాతావరణం

పలుచోట్ల ఓ మోస్తరు భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కలెక్టర్, ఎస్పీలకు సన్మానం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

ఆదిలాబాద్‌టౌన్/కైలాస్‌నగర్: గణేశ్ ఉత్సవాలను విజయవంతంగా పూర్తి చేసిన కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ గౌస్ ఆలంను హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారి కార్యాలయాల్లో కలిసి శాలువాలతో సన్మానించారు. ప్రభుత్వ పరంగా సౌకర్యాలతో పాటు, పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసి శాంతియుతంగా నిర్వహించినందుకు గాను ధన్యవాదాలు తెలిపారు. ఇందులో ఉత్సవ సమితి ప్రతినిధులు హన్మాండ్లు, లెనిన్, భాస్కర్, ఉదయ్‌కుమార్, విశ్వనాథ్, రాజకుమార్, రమేశ్, నర్సింగ్ ఉన్నారు.

నేడు యువజనోత్సవాలు

ఆదిలాబాద్: జిల్లా స్థాయి యువజనోత్సవాలను జిల్లా కేంద్రంలోని జెడ్పీసమావేశ మందిరంలో బుధవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఆసక్తి గల యువత సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కౌంటర్ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9440843848, 9381303380 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

యోగా శిక్షకుల నియామకానికి ఇంటర్వ్యూ

ఆదిలాబాద్‌టౌన్: ఆయుష్ యోగా శిక్షకుల నియామకం కోసం రిమ్స్‌లో మంగళవారం ఇంటర్వ్యూ నిర్వహించారు. వరంగల్ ఆర్‌జేడీ డాక్టర్ ప్రమీళాదేవి, అడిషనల్ డైరెక్టర్ పరమేశ్వర్లు అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. ఉమ్మడి జిల్లాలోని 41వెల్‌నెస్ సెంటర్లకుగాను 82 మంది పురుష, మహిళ శిక్షకులను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై యోగా సర్టిఫికెట్, రెండేళ్ల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు.

నూతన కార్యవర్గం

కైలాస్‌నగర్: తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. స్థానిక ప్రజాసేవభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి జాదవ్ శ్రావణ్‌నాయక్ తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా తుడుం రాములు, అధ్యక్షుడిగా సామల ప్రశాంత్, ఉపాధ్యక్షులుగా ఎండీ.రఫీక్, రతన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రవీందర్, సంయుక్త కార్యదర్శులుగా వీరాచారి, కిరణ్‌కుమార్, ఆంజనేయులు, కోశాధికారిగా ప్రవీణ్, సభ్యులుగా మల్లారెడ్డి, శ్రీనివాస్, విఠల్, సలహాదారులుగా సుజాత్ అలీ, శ్రీధర్, కిషన్, న్యాయసలహాదారులుగా గౌస్ ఎన్నికయ్యారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్

ఇంద్రవెల్లి: మండలంలోని ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సౌరభం యాదవ్ తెలిపారు. లక్సెట్టిపెటలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర పాఠశాలలో ఇటీవల నిర్వహించిన అండర్–19 (55 కిలోల) విభాగంలో పదో తరగతి విద్యార్థి రాథోడ్ పవన్, 50 కిలోల విభాగంలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం విద్యార్థి రాథోడ్ సాయికిరాణ్ ప్రతిభ కనబరిచారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌లో త్వరలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు వీరు ఎంపికైనట్లు తెలిపారు.

ఇక్కడా..యూబిట్

- జిల్లాలోనూ 'కాయిన్' జాడలు
- ఇటీవల నిర్మల్ జిల్లాలో కేసు వెలుగులోకి..
- తాజాగా ఆ పోలీసుల అదుపులో సొనాల టీచర్
- మల్టీ లెవల్ స్కీమ్ పేరిట ప్రలోభాలు



సాక్షి,ఆదిలాబాద్: ఉత్తర తెలంగాణలో ప్రస్తుతం కలకలం రేపుతున్న యూబిట్ కాయిన్ జాడలు ఆదిలాబాద్ జిల్లాలోనూ బయటపడ్డాయి. నిర్మల్ జిల్లాలో ఈ కేసు ఈనెల 1న పోలీసులు వెలుగులోకి తెచ్చారు. అప్పట్లో ఐదుగురిని అరెస్టు చేశారు. అందులో ఓ ఎక్సైజ్ ఎస్సై ఉండగా, అతను జిల్లాలోని బోథ్ మండలం సొనాల ప్రాంతానికి చెందినవారు. ఈ కేసును మరింత విచారణ చేస్తున్న నిర్మల్ పోలీసులు మంగళవారం సొనాలకు చెందిన ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడిని అదుపులోకి తీసుకోవడం సంచలనం కలిగిస్తుంది. దీంతో యూబిట్ కాయిన్ జిల్లాలోనూ పెద్ద ఎత్తున జరిగిందా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే ఈ కేసులో టీచర్లు, పోలీసు, ఎక్సైజ్ కానిస్టేబుళ్లతో పాటు పలువురు వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులు ఉన్నారనే ప్రచారం సాగుతుంది. ప్రస్తుతం నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో బయటపడగా, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లోనూ ఉన్నట్లుగా ప్రచారం ఉంది.

ప్రలోభాలు ఇలా..

యూబిట్ కాయిన్ అనే ఆన్‌లైన్ వ్యాపారంలో పెట్టుబడి పెట్టండి. మీకు డాలర్ల రూపంలో తిరిగి రెట్టింపు సొమ్ము వస్తుంది. లేనిపక్షంలో పూచికత్తు మాది అంటూ ఈ ప్లానర్స్ అమాయక జనాన్ని ప్రలోభాలకు గురిచేస్తారు. మీరు పెట్టిన పెట్టుబడి 500 రోజుల్లో 5 నుంచి 10 రేట్లు పెంచుకునే అవకాశం.. కనీస కొనుగోళ్లు 50 డాలర్లు (సుమారు రూ.4,200), గరిష్ఠ కొనుగోలు 10వేల డాలర్లు (సుమారు రూ.8.50 లక్షలు) చెబుతూ పలువురి నుంచి వివిధ మొత్తంలో పెట్టుబడి పెట్టిస్తూ వచ్చారు. ఈ పెట్టుబడి 500 రోజుల వరకు లాక్ చేయబడుతుంది. ఆ తర్వాత అది రెట్టింపు అవుతుందని చెప్పడం ద్వారా ఆకర్షిస్తారు. అయితే ఒక ఐదుగురు సభ్యుల్ని చేర్పిస్తే రోజూ ఆదాయం లభిస్తుందని వారిని ప్రలోభాలకు గురిచేస్తారు. ఈ ఐదుగురు సభ్యుల్లో ఒక్కొక్కరు రూ.50వేల వరకు పెట్టుబడి పెడితే రూ. రెండున్నర లక్షలు అవుతుంది. తద్వారా ఈ చైన్ సిస్టమ్‌లోకి తీసుకొచ్చిన వారికి రోజూ కమీషన్ లభిస్తుంది. ఇది పిరమిడ్ స్కీమ్ అని పోలీసులు పేర్కొంటున్నారు. ఇదివరకు ఒక బిట్‌కాయిన్ పేరుతో మల్టీలెవల్ మార్కెటింగ్ స్కీమ్ నిర్వహించి ఏడాది తర్వాత దాన్ని ఎత్తివేసి మరో పేరు బిట్ కాయిన్‌తో ముందుకు రావడం ప్లానర్స్ ఎత్తుగడగా పేర్కొంటున్నారు. తద్వారా పెట్టిన పెట్టుబడితో ఆదాయం వస్తుందనుకుంటే పొరపాటేనని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. చైన్ సిస్టమ్‌లో పెట్టుబడి పెట్టినప్పుడు పైవారికి కమీషన్ రూపంలో డబ్బులు వస్తాయి. దీంతోనే ఈ స్కీమ్‌ను కొనసాగిస్తూ మోసాలకు గురిచేయడం ప్లానర్స్ ఎత్తుగడగా పోలీసులు వివరిస్తున్నారు. ఈ స్కీమ్‌లో చేరిన వారు ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించినప్పుడు కమీషన్ పైనున్న సభ్యుల వరకు చేరుతుందని, ఒక వేళ క్యాష్ రూపంలో పెట్టుబడి పెడితే అది కింద చేర్పించిన వారికి కమీషన్ రూపంలో చేరుతుందని వివరిస్తున్నారు. మొత్తంగా ఈ స్కీమ్‌లో మొదట చేరిన వారు వచ్చే కమీషన్ డబ్బులే తప్పా పెట్టుబడి తిరిగి వచ్చేది కష్టమేనని స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం నిర్మల్ జిల్లాలో బయటకు వచ్చిన ఈ కేసు ఉత్తర తెలంగాణలోని అనేక జిల్లాల్లో వ్యాపించినట్లు గుర్తించారు. పోలీసుల విచారణ కొనసాగుతుంది. ప్లానర్స్ వివరాలు రాబట్టి అసలు మూలాల్లోకి వెళ్లాలని చూస్తున్నారు. ఇది ఎంతవరకు సాధ్యమవుతుందో వేచి చూడాల్సిందే.

యూబిట్ కాయిన్ స్కీమ్ మోసమంటున్న పోలీసులు..

క్రిప్టో కరెన్సీని దేశంలో క్రమబద్ధీకరించలేదు. దీంతో ఇది లీగల్ కాదు.. నాన్ లీగల్ కాదని పోలీసులు పేర్కొంటున్నారు. ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్‌లో ఎవరైనా క్రిప్టో కాయిన్ తయారు చేయవచ్చు. దానికి వారు ఒక పేరు ఇస్తారు. ఈ కేసులో యూబిట్ కాయిన్ అని ఇచ్చారు. 2024 మార్చి 29న దీన్ని ప్రారంభించారు. అప్పుడు ఆ కాయిన్ ఒక యూనిట్ విలువ రూ.16.50 పైసలని పోలీసులు చెబుతున్నారు. ఇప్పుడు మాత్రం ఆ విలువ రూ.12లకు పడిపోయినట్లు పేర్కొంటున్నారు. అలాంటప్పుడు యూబిట్ కాయిన్‌లో పెట్టుబడి పెడితే రెట్టింపు డబ్బులు ఎలా వస్తాయని ప్రశ్నిస్తున్నారు. ఈ మల్టీలెవల్ మార్కెటింగ్ స్కీమ్ ఒక మోసమని తెలిసి కూడా నడిపేవారిని ప్లానర్స్‌గా పేర్కొంటున్నారు. ఇప్పుడు అలాంటివారి పైనే కేసు నమోదు చేస్తున్నారు. కొంత మంది అవగాహన లేకున్నప్పటికీ డబ్బు రెట్టింపు అవుతుందనే ఆశతో ఈ వలలో చిక్కుకొని మోసపోతున్నారు. ప్రస్తుతం పోలీసులు ప్లానర్స్‌పై దృష్టి సారించారు. అందులో భాగంగానే అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ఎలా బయటకొచ్చింది..

క్రిప్టో కరెన్సీ, యూబిట్ కాయిన్ మల్టీ లెవల్ మార్కెటింగ్ స్కీమ్‌పై నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిలకు అనేక ఫిర్యాదులు వచ్చాయి. టిక్నాలజీతో ప్రజలకు ఏదో ఆశ చూపించి మోసాలు చేస్తున్నారని, కష్టపడకుండా డబ్బులు సంపాదించాలనే దురాశతో కొంత మంది కలిసి ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులకు ఆశ చూపి బురిడి కొట్టించి డబ్బులు పెట్టుబడిగా పెట్టిస్తున్నారు. కొద్ది రోజుల తర్వాత తాము మోసపోయామని తెలుసుకొని కొంత మంది పోలీసులను ఆశ్రయించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఆ ఎస్పీ ఈ కేసుకు సంబంధించి భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ నేతృత్వంలో ఒక ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా మొదట నిర్మల్ జిల్లాలో సెప్టెంబర్ 1న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. ఇందులో ఓ ఎక్సైజ్ ఎస్సైతో పాటు ఏఆర్ కానిస్టేబుల్ ఓ టీచర్ ఉండటం గమనార్హం. వారి ద్వారా ఈ కేసు విచారణ దూకుడును పెంచారు. ఈ స్కీమ్‌లో అనేక మందిని చేర్పించినట్లు గుర్తించారు. అయితే వీరి ద్వారా ప్లానర్స్‌ను గుర్తించే పనిలో నిర్మల్ పోలీసులు ఉన్నారు.

నిర్మల్ పోలీసుల అదుపులో ప్రభుత్వ ఉపాధ్యాయుడు..

బోథ్: నిర్మల్ జిల్లాలో సంచలనం సృష్టించిన యూబిట్ కాయిన్ కేసులో బోథ్ మండలం సొనాల గ్రామానికి చెందిన ఓ ఉపాధ్యాయుడిని నిర్మల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సర్సాపూర్ (జి)ఎస్సై హన్మండ్లు ఆధ్వర్యంలో స్పెషల్ టీం సభ్యులు మంగళవారం ఉదయం గ్రామానికి వచ్చి ఉపాధ్యాయుడిని ఇంటి వద్ద అదుపులోకి తీసుకున్నారు.

స్థానిక పోలీసులకు తెలియజేస్తారు



సొనాల వాసిని నిర్మల్ జిల్లా పోలీసులు అదుపులకి తీసుకున్న విషయం తెలియరాలేదు. అరెస్ట్ చేస్తే మాత్రం స్థానిక ఎస్‌హెచ్‌వో దృష్టికి తీసుకెళ్తారు. యూబిట్ కాయిన్ మోసానికి సంబంధించి నిర్మల్ పోలీసులు విచారణ చేస్తున్నారు.

– గౌస్ ఆలం, ఎస్పీ, ఆదిలాబాద్

ఈ రోజు వివరాలు వెల్లడిస్తాం..



యూబిట్ కాయిన్ కేసుకు సంబంధించి విచారణ కొనసాగుతుంది. బుధవారం మీడియాకు వివరాలు వెల్లడిస్తాం. అన్ని విషయాలను స్పష్టం చేస్తాం.

– జానకీ షర్మిల, ఎస్పీ, నిర్మల్

పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కావాలి

- కలెక్టర్ రాజర్షి షా



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: పంచాయతీ ఎన్నికలకు అధికారులు సిద్ధం కావాలని, ఆ దిశగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పంచాయతీ, ఇతర శాఖల అధికారులతో మంగళవారం పలు అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటర్ల తుది జాబితాను పారదర్శకంగా ప్రకటించాలన్నారు. 3,870 పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, దశల వారీగా ఎన్నికలు జరిగే జీపీల ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు. పది మంది టీఓటీ రిసోర్స్‌పర్సన్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. స్వచ్ఛతాహీ సేవా పక్షోత్సవాల్లో విస్తృతంగా పాల్గొనాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణపై చర్యలు చేపట్టడంతో పాటు డెంగీ ప్రబలకుండా పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు ప్రతీరోజు గ్రామాల్లో పర్యవేక్షించి నివేదికలు సమర్పించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్, జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి, డీఆర్డీవో సాయన్న, డీపీవో శ్రీలత, ఆర్డీవో వినోద్ కుమార్, డీఎంహెచ్‌వో కృష్ణ, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

‘ఆక్రమణలు తొలగించాలి’



ఆక్రమణలను పరిశీలిస్తున్న కమిషనర్

కైలాస్‌నగర్: పట్టణంలోని రిమ్స్ ఆసుపత్రి ప్రధాన ద్వారానికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తక్షణమే తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ఎండీ. ఖమర్‌అహ్మద్ ఆదేశించారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, టౌన్‌ప్లానింగ్ అధికారి సుమలతతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. అక్కడ వ్యాపారాలు నిర్వహిస్తున్న వారితో మాట్లాడారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, సహాయకులతో పాటు వైద్య విద్యార్థులకు సైతం ఇబ్బందులు ఎదురవుతున్నందున గేటు వద్ద గల దుకాణాలను స్వచ్ఛందంగా తీసివేయాలని వ్యాపారులకు సూచించారు. లేకుంటే మున్సిపల్ ఆధ్వర్యంలో తొలగిస్తామన్నారు. వాటి నిర్వహణకు గాను ఆసుపత్రి వద్దే ప్రత్యేక స్థలం చూపించారు. ఆయన వెంట టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తదితరులున్నారు.

నిరంతర సాధనతోనే విజయాలు

- ఏటీడీవో నిహారిక
- డివిజన్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఏటీడీవో నిహారిక

ఆదిలాబాద్: నిరంతర సాధనతోనే విజయాలు సాధ్యమవుతాయని ఏటీడీవో నిహారిక అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఆదిలాబాద్ డివిజన్ స్థాయి గిరిజన క్రీడోత్సవాలను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు దోహదపడతాయన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలన్నారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు క్రీడోత్సవాలు తోడ్పడతాయన్నారు. డివిజన్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 27న ఉట్నూర్‌లో నిర్వహించనున్న జోనల్‌స్థాయి పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. క్రీడోత్సవాల్లో భాగంగా వాలీబాల్, అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, ఆర్చరీ, టెన్నీకాయిట్, చెస్, క్యారం వంటి క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్జీఎఫ్ కార్యదర్శి కాంతారావు, పోటీల ఇన్‌చార్జి పవార్ లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయులు నారాయణరావు ,శ్రీనివాస్, పీడీలు రవీందర్, గోపాల్, శ్రీనివాస్, ప్రేమ్ సింగ్, గోపాల్, ఖాజిం తదితరులున్నారు.

జాతర్ల మినీ స్టేడియంలో..

బజార్‌హత్నూర్: మండలంలోని జాతర్ల మినీస్టేడియంలో మంగళవారం బోథ్ డివిజన్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఏటీడీవో అమిత్ మాట్లాడుతూ, డివిజన్‌లోని 14 గిరిజన బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఇందులో ప్రతిభ కనబరిచిన 120 మంది క్రీడాకారులను ఉట్నూర్‌లో నిర్వహించనున్న జోనల్‌స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కిషన్‌రెడ్డి, గోడం చందన్, పెందూర్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

27న మెగా వాలీబాల్ టోర్నీ

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి మెగా వాలీబాల్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ గౌస్ ఆలం ప్రకటనలో తెలిపారు. గుడిహత్నూర్ మోడల్ స్కూల్‌లో శుక్రవారం ఉదయం 8 గంటలకు టోర్నీని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 29 వరకు కొనసాగనున్న టోర్నీలో పాల్గొనేందుకు జిల్లాలోని వాలీబాల్ జట్లకు ఆహ్వానం పలుకుతున్నట్లు తెలిపారు. ఇచ్చోడ సీఐ ని 8712659936 నంబర్‌లో, గుడిహత్నూర్ ఎస్సై 8712659946, నేరడిగొండ ఎస్సై 87126 59947, సిరికొండ ఎస్సైని 8712659948 నంబర్‌లో ఈనెల 26వ తేదీ సాయంత్రం 6 గంటల లోపు సంప్రదించాలని సూచించారు. ఇందులో పాల్గొనే వారికి ఎంట్రీ ఉచితమని పేర్కొన్నారు. ప్రథమ బహుమతిగా రూ.10,116నగదు,ద్వితీయ బహుమతిగా రూ. 8,116, తృతీయ బహుమతిగా రూ.5,116 నగదు అందజేయనున్నట్లు తెలిపారు.

ఆ చీరలు వెనక్కి..

- గతేడాది మిగిలిన 'బతుకమ్మ' కానుకలు తిరిగి పంపాలి
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- జిల్లాలో మిగిలిన చీరలు 5,910

కైలాస్‌నగర్: బతుకమ్మ పండుగ పురస్కరించుకుని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలంగాణ ఆడపడుచులకు పండుగ కానుకగా చీరలు పంపిణీ చేసింది. గతేడాది సైతం జిల్లాకు పెద్ద సంఖ్యలో కేటాయించింది. అయితే అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఈ పంపిణీ పూర్తిస్థాయిలో చేపట్టలేదు. దీంతో పలు చోట్ల చీరలు మిగిలాయి. గోదాంల్లో వృథాగా పడి ఉన్న వాటిని వెనక్కి పంపించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్ శాఖ రాష్ట్ర కమిషనర్ శైలజ రామయ్యర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆ దిశగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు.

కోడ్ కారణంగా పంపిణీకి బ్రేక్

గత ప్రభుత్వ హయాంలో 2023 సంవత్సరానికి గాను జిల్లాకు 2,63,250 చీరలను సెప్టెంబర్ నెలలో పంపించింది. అధికారులు ప్రతీ జీపీ పరిధిలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ఆధార్‌కార్డు ఆధారంగా మహిళలు, యువతులకు పంపిణీ చేశారు. జిల్లాలోని 17మండలాలల పరిధిలో 2,57,340 చీరలను అందజేశారు. ఈ క్రమంలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. దీంతో చీరల పంపిణీకి బ్రేక్ పడింది. ఫలితంగా పలు చోట్ల పంపిణీ పూర్తిస్థాయిలో జరగలేదు. ఐదారు మండలాల్లోనే ఈ పరిస్థితి ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇలా పంపిణీ చేయకుండా జిల్లాలో 5,910 చీరలు మిగిలిపోయినట్లుగా తెలిపారు. వాటిని తిరిగి రాష్ట్ర కార్యాలయానికి పంపించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ దిశగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు మండలాల నుంచి వాటిని తెప్పించే దిశగా చర్యలు చేపడుతున్నారు. అయితే ఇందుకోసం ప్రత్యేక నిధులేమి కేటాయించకపోవడంతో అదనపు భారంగానే మారుతోందని అభిప్రాయపడుతున్నారు.

ఐటీడీఏ పరిధిలోని మహిళలకు అందజేత..

ఆయా జిల్లాల నుంచి హైదరాబాద్‌లోని చేనేత, హస్తకళల అభివృద్ధిశాఖ కార్యాలయానికి ఆ చీరలను పంపించాలని సూచించారు. అక్కడికి పూర్తిస్థాయిలో అందిన ఈ చీరలను ఐటీడీఏ పరిధిలోని మహిళలకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఏజెన్సీ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలు, ఆదివాసీ మహిళలకు పంపిణీ చేయాలని భావిస్తున్నట్లుగా తెలుస్తోంది.

ఉత్తర్వులు అందాయి

గతేడాదికి సంబంధించి జిల్లాలో పంపిణీ చేయకుండా మిగిలిపోయిన బతుకమ్మ చీరలను వెనక్కి పంపించాలని పేర్కొంటూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు అందాయి. హైదరాబాద్‌కు పంపించేందుకు వీలుగా తగు చర్యలు తీసుకుంటున్నాం. ఏయే మండలాల్లో చీరలు మిగిలి ఉన్నాయో వాటిని పంపించాల్సిందిగా అక్కడి సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం.

– సాయన్న, డీఆర్డీవో

చట్టాలపై అవగాహన అవసరం

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ఖానాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడు మనకు జరిగే అన్యాయాలను ఎదిరించవచ్చని పేర్కొన్నారు. విద్యా హక్కు, పోక్సో, బాల్య వివాహ తదితర చట్టాలను వివరించారు. ఇందులో ప్రధానోపాధ్యాయుడు ఎం.సంతోష్, న్యాయవాదులు గంగారాం, అశోక్, ఉమేష్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీనియర్ హెచ్‌ఎంలకు ఎంఈవోలుగా బాధ్యతలు

- జిల్లాలో 17మంది మండల నోడల్ అధికారులకు..

ఆదిలాబాద్‌టౌన్: విద్యా వ్యవస్థను గాడిన పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కొన్నేళ్లుగా కోర్టు కేసుల కారణంగా ప్రభుత్వం రెగ్యులర్ ఎంఈవోల నియామకాలు చేపట్టడం లేదు. అయితే ఇదివరకు సీనియర్ ప్రధానోపాధ్యాయులకే ఎంఈవో బాధ్యతలు అప్పజెప్పిన విషయం తెలిసిందే. అయితే కొంత మంది కోర్టుకు వెళ్లడంతో ఇదివరకు ఎఫ్‌ఏసీ ఎంఈవోలుగా పనిచేసిన వారికే ఇతర మండలాలకు అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. దీంతో జిల్లాలో ఒక్కొక్కరు మూడు మండలాల చొప్పున బాధ్యతలు చేపట్టాల్సి వచ్చింది. వీరికి పనిభారం కావడంతో పాఠశాలల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో చేయలేకపోయారు. అయితే గతేడాది నుంచి సీనియర్ హెచ్‌ఎంకు మండల నోడల్ అధికారిగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. ప్రస్తుతం జిల్లాలో ఒక్కరు రెగ్యులర్ ఎంఈవో ఉండగా, ఐదుగురు ఇన్‌చార్జి ఎంఈవోలు పనిచేస్తున్నారు. అయితే మంగళవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ మండల నోడల్ అధికారులుగా విధులు నిర్వహిస్తున్న సీనియర్ హెచ్‌ఎంలకు ఎఫ్‌ఏసీ ఎంఈవోలుగా బాధ్యతలు అప్పగించారు. ఇదివరకు పనిచేస్తున్న ఆరుగురితో పాటు మరో 12 మందికి అదనపు బాధ్యతలు అప్పజెప్పారు.

ఎఫ్‌ఏసీ ఎంఈవోలు వీరే..

మండలం	ఎంఈవో (ఎఫ్‌ఏసీ)
ఆదిలాబాద్‌రూరల్	ముజాఫర్ హుస్సేన్
మావల	సరోజ
తలమడుగు	వెంకట్‌రావు
ఇచ్చోడ	కె.బిక్కు
సిరికొండ	పి.సునీల్
నార్నూర్	పి.అనిత
గాదిగూడ	మనోహర్
బజార్‌హత్నూర్	కిషన్ గుప్తా
ఉట్నూర్	ఆర్.ఆశన్న
నేరడిగొండ	ఎ.భూమారెడ్డి
గుడిహత్నూర్	ఆర్.ఉదయ్‌రావు
తాంసి	డి.శ్రీకాంత్
జైనథ్	బి.శ్రీనివాస్
బోథ్	ఇ.పోశెట్టి
భీంపూర్	శ్యామ్‌సుందర్‌రావు
బేల	కోల నర్సింలు

కేజీబీవీలలో నాణ్యమైన విద్య

- కలెక్టర్ రాజర్షి షా



విద్యార్థులకు శానిటరీ ప్యాడ్స్ పంపిణీ చేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్‌రూరల్: కేజీబీవీలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందజేస్తున్నట్లు కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మండలంలోని బంగారుగూడలో గల కేజీబీవీలో లెర్నింగ్ కర్వ, భారత్ పెట్రోలియం కెమికల్స్ లిమిటెడ్ సంస్థలు సంయుక్తంగా విద్యార్థినులకు ఏడాదికి సరిపడా శానిటరీ ప్యాడ్స్, ఇన్సినేరేటర్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జిల్లాలోని 18 కేజీబీవీల్లో గల విద్యార్థినులకు ఏడాదికి సరిపడా శానిటరీ ప్యాడ్స్‌తో పాటు ఒక్కో కేజీబీవీకి ఒక్కో ఇన్సినేరేటర్ చొప్పున పంపిణీకి ముందుకు వచ్చిన ఆయా సంస్థల కృషి అభినందనీయమన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. ఇందులో డీఈవో ప్రణీత, కేజీబీవీల సంయుక్త అధికారి ఉదయశ్రీ, లెర్నింగ్ కర్వ సంస్థ అధికారి స్వప్న, బీపీసీఎల్ డీలర్ ముడుపు మౌనిష్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు పూర్తి విశ్వాసం కల్పించాలి

మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి అందజేస్తున్న నీటిని ప్రజలు పూర్తిస్థాయిలో తాగేలా వారిలో విశ్వాసం కల్పించాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదిలాబాద్ రూరల్ ఎంపీడీవో సమావేశ మందిరంలో గ్రామనీటి సహాయకుల శిక్షణ కార్యక్రమం మంగళవారం రెండో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ ట్యాంకుల ద్వారా అందజేస్తున్న నీటిని నెలలో 1, 11, 21 తేదీలలో మూడు సార్లు మూడుచోట్ల పరీక్షించాలన్నారు. తాగునీరు కలుషితం కాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇందులో మిషన్‌భగీరథ ఎస్‌ఈ సురేశ్, డీఈ దేవయ్య, ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, వాటర్ క్వాలిటీ కన్సల్టెంట్ తిరుపతి, తదితరులున్నారు.

జంతు సంరక్షణ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణం బంగారుగూడ డంపింగ్‌యార్డులో గల జంతు సంరక్షణ కేంద్రాన్ని కలెక్టర్ రాజర్షి షా మంగళవారం సందర్శించారు. శునకాలకు చేపడుతున్న సర్జరీలను పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కుక్కలను ఉంచే ప్రత్యేక గదులను పరిశీలించారు. పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, తదితరులున్నారు.

క్లుప్తంగా

అంత్యక్రియలు అడ్డగింత



పోలీసులతో మాట్లాడుతున్న బాధితులు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని బురుదగూడెంకు చెందిన దుర్గం శ్రీనివాస్(30) అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహిస్తుండగా గొడ సంఘం ప్రతినిధులు అడ్డుకున్నారు. తమ స్థలంలో అంత్యక్రియలు చేయొద్దని సూచించారు. ఈ క్రమంలో ఇరుపక్షాల మధ్య వాగ్వాదం జరిగింది సమాచారం అందుకున్న సీఐ శశిధర్‌రెడ్డి, తహసీల్దార్ సతీశ్‌కుమార్ ఘటన స్థలికి చేరుకున్నారు. వివాదం రెండు మూడు రోజుల్లో పరిష్కరిస్తామని చెప్పడంతో అంత్యక్రియలు నిర్వహించారు.

మహిళపై దాడిచేసిన ఐదుగురిపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన రీమా యాదవ్‌పై దాడి చేసిన ఐదుగురిపై కేసు నమోదు చేశామని పట్టణ సీఐ శంకరయ్య తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన పురుషోత్తం తన మొబైల్‌లో వ్యక్తిగత వీడియోను ఉంచుకున్నాడనే సమాచారంతో బాధిత మహిళ ఎన్టీఆర్ చౌక్‌లోని అతడి షాపు వద్దకు వెళ్లి వీడియో తొలగించాల్సిందిగా కోరింది. నాలుగు రోజులైనా ఆ వీడియోను డిలీట్ చేయకపోవడంతో సదరు మహిళ భర్త సంతోష్‌తో కలిసి ఈ నెల 20న పురుషోత్తం షాపు వద్దకు వెళ్లింది. వీడియోను డిలీట్ చేయాలని కోరింది. ఈ క్రమంలో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగి పురుషోత్తం, నాయకపు శివాగౌడ్, నవీన్‌గౌడ్, భరత్, అవినాశ్ కలిసి రీమాయాదవ్‌తోపాటు ఆమె భర్త సంతోష్‌పై దాడి చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి, నాయకపు శివాగౌడ్‌ను మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. అలాగే బాధితురాలి వ్యక్తిగత వీడియోను సోషల్‌మీడియాలో వైరల్ చేసిన శైలజ, తూడూరు ఈశ్వర్‌ను కూడా రిమాండ్‌కు తరలించామన్నారు.

చెన్నూరులో కుక్కల వధ



పదునైన ఆయుధంతో కుక్కలను హతమారుస్తున్న సీసీ టీవీ ఫుటేజీ

చెన్నూర్: చెన్నూర్ గాంధీచౌక్ ప్రాంతంలో పదునైన ఆయుధంతో కుక్కలను వధిస్తున్నారు. ఈ దృశ్యం సీసీ కెమెరాలో రికార్డు అయింది. ఈ వీడియో పట్టణంలోని వైరల్ అవుతోంది. కుక్కలను హతమారుస్తున్న వ్యక్తి చెన్నూర్ మున్సిపాలిటీలో స్వచ్ఛ ఆటో డ్రైవర్ దుగ్యాల బాపుగా గుర్తించారు. కుక్కల నియంత్రణ కోసం ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో కుక్కలను చంపే వీడియో వెలుగులోకి రావడంతో జంతు ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై దుగ్యాల బాపును వివరణ కోరగా తనది డే డ్యూటీ అని, రాత్రివేళ ఆటో నడుపుతూ ఉపాధి పొందుతానని తెలిపాడు. తనకు పందులు కూడా ఉన్నాయని పేర్కొన్నాడు. తన రెండు పందులను వీధికుక్కలు చంపాయని, ఆ కోపంతోనే గాంధీచౌక్ ప్రాంతంలో ఉన్న కుక్కలను చంపానని తెలిపాడు. మున్సిపల్ అధికారులకు దీనితో సంబంధం లేదని పేర్కొన్నాడు.

ప్రయాణికుల చెంతకే సమాచారం

- ఆర్టీసీ వినూత్న ఆలోచన
- ప్రయాణికులకు చేరవయ్యేలా ప్రణాళిక
- వెయ్యి మందికో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు
- ఎప్పటికప్పుడు గ్రూపులలో సమాచారం



ప్రయాణికులకు గమ్యం యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఆర్టీసీ సిబ్బంది



బస్సు వద్ద యాప్‌డౌన్‌లోడ్ చేయిస్తున్న కండక్టర్

మంచిర్యాలఅర్బన్: ప్రయాణికులను మెరుగైన సేవలు అందించడంతోపాటు ఆర్టీసీకి మరిన్ని లాభాలు తీసుకురావడంపై యజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది. సమాచారం ఎప్పటికప్పుడు చేరవేయడం.. సందేహాల నివృత్తికి ఆర్టీసీ 'గమ్యం' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఇదివరకు ప్రయాణికులకు బస్సు ట్రాకింగ్ యాప్‌ను ప్రవేశపెట్టింది. యాప్‌పై విస్తృత ప్రచారం చేపట్టడంతోపాటు ప్రయాణికులకు మరింతగా చేరువయ్యేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు. బస్‌స్టేషన్లు, ఇతర ప్రాంతాల్లో ఆర్టీసీ ఉద్యోగులు గమ్యంపై అవగాహన కల్పిస్తున్నారు. స్మార్ట్‌ఫోన్ ఉన్న ప్రయాణికులతో యాప్ డౌన్‌లోడ్ చేయించడం.. క్యూఆర్‌కోడ్‌తో స్కాన్ చేయటం.. వారి ఫోన్ నంబర్లు తీసుకుని ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేస్తున్నారు. అదే గ్రూపులో ఆర్టీసీ సమాచారాన్ని ఎప్పటికప్పుడు షేర్ చేస్తున్నారు. బస్సు ట్రాకింగ్‌తోపాటు కొత్తగా ఏయే బస్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయో జాబితాను ప్రతీరోజు వాట్సాప్ గ్రూపులో సమాచారం ఇస్తున్నారు.

వాట్సప్‌లో సమాచారం..

మంచిర్యాల డిపోలో గమ్యం యాప్ డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. బస్‌స్టేషన్‌తోపాటు బస్సుల్లో ప్రయాణం చేసేవారి స్మార్ట్‌ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేయించి అవగాహన కల్పిస్తున్నారు. మరోవైపు వారి ఫోన్ నంబర్లు తీసుకుంటున్నారు. ఒక్కో వాట్సాప్ గ్రూపులో వెయ్యి మందికి తగ్గకుండా చూస్తున్నారు. గమ్యం యాప్‌లో బస్సుల రాకపోకలపై తెలిపోతుండగా.. వాట్సాప్ గ్రూప్‌లో రిజర్వేషన్ సమాచారం ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారు. ఇప్పటికే మంచిర్యాల డిపోలో 3,200 మందికిపైగా ప్రయాణికులు యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నారు. మంచిర్యాల డిపో పరిధిలో మూడు గ్రూపులు ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ రీజియన్‌లో 10 గ్రూపులు ఏర్పాటు చేశారు. అంటే పది వేల మంది ప్రయాణికులు ఈ గ్రూపుల్లో ఉన్నారు. ఈగ్రూపులో ప్రతీరోజు ఉదయం 8 గంటల్లోపు.. మధ్యాహ్నం 2 గంటల్లోపు బస్సుల్లో సీట్లు వివరాలకు సంబంధించిన పూర్తి వివరాలు అందులో ఉంచుతున్నారు. దీంతో రిజర్వేషన్ సీటు ఉందా..? లేదా అనేది తెలిసిపోతుంది. ఇంకోవైపు ప్రయాణికుల సలహాలు, సూచనలు కూడా గ్రూప్‌లో చేసే అవకాశం కల్పించారు. ప్రయాణికుల సందేహాల నివృత్తితోపాటు సలహాలు స్వీకరించనున్నారు.

పండుగవేళ...

దసరా, దీపావళి, సంక్రాంతి పండుగ ఏదైనా వాట్సాప్ గ్రూపులో చేరిన ప్రతీ ప్రయాణికునికి శుభాకాంక్షలు తెలియజేయనున్నారు. పండుగ వేళ రద్దీ ఉంటే ప్రయాణికుల సూచనల మేరకు బస్సులు నడపించనున్నారు. ప్రయాణికుల ఇబ్బందులు ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి వాట్సప్ గ్రూపులు దోహదపడనున్నాయి.

ప్రయాణికుల ఫోన్‌కే సమాచారం..



బస్సు బయలుదేరే సమయం గమ్యస్థానం చేరే సమయం కచ్చితమైన స్టేటస్ తెలుసుకునేందుకు గమ్యం యాప్ అందుబాటులో ఉంది. యాప్ డౌన్‌లోడ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాం. ఇక ప్రయాణికులకు సులభంగా సమాచారం అందించేందుకు వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ప్రయాణికులను ఆకర్షించేలా సేవలు అందిస్తున్నాం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేశాం. అదే గ్రూపుల్లో ఆర్టీసీకి సంబంధించిన ఆయా డిపోల సమాచారం ఎప్పటికప్పుడు చేరవేస్తున్నాం.

– సోలోమన్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, ఆదిలాబాద్

ఏజెన్సీ ప్రాంత ముస్లింలతో ప్రభుత్వం చర్చలు



మైనార్టీ మత పెద్దలతో చర్చిస్తున్న మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ విఠల్

ఉట్నూర్‌రూరల్: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో ఇటీవల చోటుచేసుకున్న ఘటన నేపథ్యంలో స్థానిక ఆదివాసీ, మైనార్టీల వర్గాల మధ్య సయోధ్య కుదుర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వరుస భేటీలు నిర్వహిస్తోంది. రెండు రోజుల క్రితం ఉట్నూర్‌లో ఆదివాసీ సంఘాలతో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు చర్చలు జరిపిన విషయం తెలిసిందే. తాజాగా మైనార్టీ వర్గానికి చెందిన పెద్దలతో మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మంత్రి సీతక్క, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే బొజ్జు, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి సమావేశం అయ్యారు. సమస్యల మూలాలతోపాటు పరిష్కార మార్గాలు సూచించాలని కోరగా మైనార్టీ పెద్దలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. సఖ్యతతో ఉన్న రెండు వర్గాల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టే మూకలపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. మత రాజకీయాలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. ఇరువర్గాల పెద్దలతో త్వరలో ఉమ్మడి సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

పెళ్లికి ఒప్పుకోరని ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

- ప్రియుడు మృతి.. చావుబతుకుల్లో యువతి
- ఉట్నూర్ మండలంలో ఘటన



హన్మంత్ రావు (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: ప్రేమించుకున్నారు.. వివాహం చేసుకుందామనుకున్నారు.. అయితే పెళ్లికి పెద్దలు ఒప్పుకోరేమోనని భావించిన ఆ ప్రేమ జంట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇందులో యువకుడు మృతి చెందగా యువతి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంది. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కన్నాపూర్ పంచాయితీ పరిధి రాంజీగూడకు చెందిన ఆత్రం తుకారాం–విజ్జుబాయిలకు ముగ్గురు సంతానం. ఇద్దరు కుమారులు, కుమార్తె. తుకారం నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. పెద్దకొడుకు హన్మంత్‌రావు (22) తమకున్న నాలుగెకరాల భూమిని వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్నేళ్ల క్రితం ఆయనకు నార్నూర్ మండలం బొడ్డిగూడకు చెందిన ఓ యువతితో పరిచయమై ప్రేమగా మారింది. పెళ్లి విషయం పెద్దలకు చెబితే వారు ఒప్పుకోరు అని ఇరువురు భావించారు. ఈ క్రమంలో హన్మంత్‌రావు ప్రియురాలతో కలిసి సోమవారం కన్నాపూర్ సమీపంలోని పంట చేలో ఇద్దరు పురుగుల మందు తాగి పడిపోయారు. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో తల్లి విజ్జుబాయి స్థానికులు, బంధువులకు కొడుకు చేను నుంచి రాలేదని చెప్పడంతో అందరు కలిసి పంట చేలోకి వెళ్లారు. అక్కడ ఇద్దరు పురుగుల మందు తాగి స్పృహ తప్పి పడిపోయి ఉన్నారు. వెంటనే వారిని 108లో ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి చేరుకునేలోపు హన్మంత్‌రావు రాత్రి మృతి చెందాడు. ప్రియురాలును మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి కూడా విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మృతుడి తల్లి విజ్జుబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తెరుచుకున్న ఎంసీహెచ్

- 22 రోజుల తర్వాత వైద్య సేవలు ప్రారంభం



మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి బాలింతలు, గర్భిణులను తరలిస్తున్న అంబులెన్స్

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో గోదావరి ఒడ్డున నిర్మించిన మాతా శిశు ఆరోగ్య కేంద్రాన్ని వరదల భయంతో ఈనెల 2న అధికారులు మూసివేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులను మంచిర్యాల జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వర్షాలు, వరదలు తగ్గడంతో 22 రోజుల తర్వాత మంగళవారం మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలను పునఃప్రారంభించారు. 2022లో ప్రారంభించిన ఎంసీహెచ్ భవనం ఏటా వర్షాకాలంలో ముంపునకు గురవుతోంది. బాలింతలు, గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. ఏటా వర్షాకాలంలో మూడు నెలలపాటు ఎంసీహెచ్ భవనాన్ని మూసి ఉంచుతున్నారు. ఈసారి మాత్రం కేవలం 22 రోజుల్లోనే తెరిచారు.

డీఎస్సీ 2008 అభ్యర్థులకు కాంట్రాక్ట్ టీచర్ ఉద్యోగాలు

- ఉమ్మడి జిల్లాలో 135 మంది

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వం 2008 డీఎస్సీ బీఎడ్ అభ్యర్థులకు కాంట్రాక్ట్ టీచర్ ఉద్యోగాలు కల్పించేందుకు నిర్ణయించింది. ఇందుకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2008 డీఎస్సీ భర్తీ ప్రక్రియకు సంబంధించి అప్పట్లో డీఎడ్ అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. దీంతో సీనియారిటీ జాబితాలో ఉన్న బీఎడ్ అభ్యర్థులకు పోస్టింగ్ దక్కలేదు. కోర్టును ఆశ్రయించడంతో వారికి కాంట్రాక్ట్ పద్ధతిన ఉపాధ్యాయులుగా ఉపాధి కల్పించాలని నిర్ణయించారు. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో 135 మంది అభ్యర్థులు ఉన్నారు. వీరిలో ఇప్పటికే చాలా మంది వివిధ శాఖల్లో ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. వీరు ఉద్యోగం చేయడానికి ఇష్టపడతారా.. లేదా అనే వివరాలు సేకరించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. అయితే వీరి వేతనం, ఇతర విషయాలు తెలియరావాల్సి ఉంది. ఈనెల 27 నుంచి అక్టోబర్ 5 వరకు విద్యాశాఖ కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎట్టకేలకు ప్రభుత్వం నుంచి కాంట్రాక్ట్ పద్ధతిన ఉద్యోగం కల్పిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ కావడంతో అభ్యర్థుల్లో హర్షం వ్యక్తమవుతుంది.

29న ఉమ్మడి జిల్లాస్థాయి చెస్ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్–15 బాలబాలికల చెస్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి స్వామి, పోటీల కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాలలో ఉదయం 10గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. జనవరి 1, 2009 తర్వాత జన్మించిన బాలబాలికలు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 28 సాయంత్రం 5 గంటల్లోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. సొంత చెస్‌బోర్డు, వయస్సు ధ్రువీకరణ పత్రం వెంట తెచ్చుకోవాలన్నారు. వివరాలకు 9848736476, 6281966588 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సింగరేణి కార్మికులకు దసరా అడ్వాన్స్ రూ.25 వేలు

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు దసరా అడ్వాన్స్‌గా రూ.25 వేలు చెల్లించాలని నిర్ణయించినట్లు సీఎండీ బలరామ్ తెలిపారు. ఈ మొత్తాన్ని సెప్టెంబర్ వేతనాలతో కలిపి ఇస్తామని వెల్లడించారు. ఇక లాభాల వాటా డబ్బులను అక్టోబర్ 9న చెల్లిస్తామని పేర్కొన్నారు. సీనియర్ కార్మికులకు ఒక్కొక్కరికి రూ. 1.9 లక్షల వరకు వస్తాయని చెప్పారు. వీటిని కార్మికుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని వెల్లడించారు. అడ్వాన్స్ డబ్బులను వాయిదా పద్ధతిలో రికవరీ చేస్తామని తెలిపారు.

మంచిర్యాలలో కత్తులతో దాడి

- కేసు నమోదు చేసిన పోలీసులు



బైపాస్ రోడ్డు వద్ద పహర కాస్తున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్‌లో ప్రముఖ రియల్టర్ జగన్‌మోహన్‌రావు ఇంటివద్ద ఈ నెల 23న అర్ధరాత్రి రెండువర్గాలు కత్తులతో పరస్పరం దాడి చేసుకున్నాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. వివరాలు సేకరించారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. సోమవారం అర్ధరాత్రి కొందరు వ్యక్తులు జగన్‌మహన్ రావుపై దాడి చేసేందుకు యత్నించారు. అయితే ఆయన అక్కడ లేకపోవడంతో అతని అనుచరులపై దాడికి యత్నించగా ఇరువర్గాలు పరస్పరం దాడి చేసుకున్నట్లు తెలిసింది. ఈ విషయమై స్థానిక సీఐ బన్సిలాల్‌ను వివరణ కోరగా దాడి జరిగింది వాస్తవమే అని తెలిపారు. జగన్‌మోహన్‌రావు దగ్గర పనిచేసే మేర సంజీవ్‌కు స్థానిక వాటర్‌ట్యాంక్, ఆర్‌పీ రోడ్ ఏరియాకు చెందిన రుద్రతేజ, జ్ఞానేశ్వర్ తోపాటు మరి కొందరికి పాత గొడవలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే సంజీవ్‌పై దాడికి యత్నించారని పేర్కొన్నారు. ఈ ఘటనలో సంజీవ్‌తోపాటు అక్కడ పని చేసేమరో వాచ్‌మెన్‌కు గాయలయ్యాయన్నారు. ఈ దాడికి పాల్పడిన రుద్రతేజ, జ్ఞానేశ్వర్ కూడా స్వల్పంగా గాయపడినట్లు తెలిపారు. సంజీవ్, వాచ్‌మెన్‌ను చికిత్స కోసం కరీంనగర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని పేర్కొన్నారు. సంజీవ్ ఫిర్యాదు మేరకు రుద్రతేజ, జ్ఞానేశ్వర్ తోపాటు మరికొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఫొటోలు తీసి.. లైంగికదాడి చేసి

- మైనర్‌పై అఘాయిత్యం చేసిన యువకుడి అరెస్ట్
- పోక్సో కేసు నమోదు..
- వివరాలు వెల్లడించిన కాగజ్‌నగర్ డీఎస్పీ



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామానుజం

కౌటాల: కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో దారుణ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. చింతలమానెపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై లైంగిక దాడిచేసిన నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈమేరకు వివరాలను కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం కౌటాల పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం సాయంత్రం వెల్లడించారు. చింతలమానెపల్లి మండలం డబ్బా గ్రామానికి చెందిన లంబోటి వెంకటేశ్ అనే యువకుడు బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. బాలిక వ్యక్తిగత ఫొటోలు తీసి వాటిని చూపిస్తూ ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలు ఇటీవల విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో వారు వెంకటేశ్ షాపు వద్దకు వెళ్లి నిలదీయగా, నిందితుడు బాలిక తండ్రిపై దాడిచేశాడు. దీంతో ఈనెల 22న చింతలమానెపల్లి పోలీసులకు వెంకటేశ్‌తోపాటు అతని కుటుంబ సభ్యులు నానయ్య, శారద, మీనా, సురేశ్, మానసపై ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేసి వెంకటేశ్‌ను మంగళవారం అరెస్టు చేసి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాలిక తల్లిదండ్రులపై దాడి కేసులో వెంకటేశ్‌తోపాటు నానయ్య, శారద, మీనా, సురేష్, మానసపై కేసు నమోదు చేశారు. వెంకటేశ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో కౌటాల సీఐ రమేశ్, ఎస్సై ఎస్.మధుకర్, చింతలమానెపల్లి ఎస్సై నరేశ్ ఉన్నారు.

గంజాయి తరలిస్తున్న కంటైనర్ పట్టివేత?

- పిప్పల్‌గావ్ వద్ద పట్టుకున్న పోలీసులు
- తలమడుగు స్టేషన్‌కు తరలింపు



పోలీస్‌స్టేషన్‌లో కంటైనర్

తలమడుగు: హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు వెళ్తున్న ఓ కంటైనర్‌ను భారీగా గంజాయి తరలిస్తున్నారనే అనుమానంతో ఆదిలాబాద్ పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం రాత్రి ఆదిలాబాద్, తలమడుగు పోలీసులు ఆధ్వర్యంలో కంటైనర్‌ను వెంబడించి పిప్పల్‌గావ్ గ్రామ సమీపంలోని అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. ఇందులో పెద్ద మొత్తంలో గంజాయి ఉన్నట్లు గుర్తించి తలమడుగు స్టేషనకు తరలించారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి, ఎస్సై అంజమ్మ డ్రైవర్ ద్వారా వివరాలు సేకరిస్తున్నారు. పోలీసులు ఎలాంటి వివరాలు వెల్లడించడం లేదు. జిల్లా ఉన్నతాధికారులు తదుపరి వెల్లడిస్తారని తెలిపారు. స్టేషన్ చుట్టూ బందోబస్తు పెంచారు. లోనికి ఎవరినీ అనుమతించడం లేదు. కాగా, ఈ కంటైనర్ యూపీకి చెందిన చెందిన నంబర్ ప్లేట్‌తో ఉంది. అందులో ఏముంది. ఎంత మోతాదులో ఉందో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పోలీసు విధులకు ఆటంకం కలిగించిన 13 మందిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పోలీసు విధులకు ఆటంకం కలిగించిన 13 మందిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఇటీవల పట్టణంలోని శ్రీకృష్ణ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాథోడ్ జితేందర్ అనే విద్యార్థి మృతి చెందాడు. ఆయన మృతికి కారకులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి, బస్టాండ్ ఎదుట బైఠాయించి విధులకు ఆటంకం కలిగించడం, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పాటు ప్రయాణికులకు ఇబ్బంది కలిగించారని పేర్కొన్నారు. 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నట్లు చెప్పినప్పటికీ వినిపించుకోకుండా ధర్నా చేసినట్లు తెలిపారు. ఈ మేరకు రాథోడ్ ఆత్మరాం, రాథోడ్ రాహుల్, పవార్ బలప్‌సింగ్, పవార్ నగేష్, అక్షయ్, నరేష్, చౌహాన్ మధుకర్, విశ్వనాథ్, పవార్ కృష్ణ, రాథోడ్ అజయ్, రాథోడ్ ఓంపాల్, బాబ్సన్, రాథోడ్ దినేష్‌పై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

ఎస్టీపీపీ కార్మికుల సమస్యలపై చర్చలు



సింగరేణి, పవర్‌మేక్ కంపెనీ, యూనియన్ నాయకులతో డిప్యూటీ సెంట్రల్ లేబర్ కమిషనర్ చర్చలు

జైపూర్: జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై హెచ్ఎంఎస్, బీఎంఎస్ యూనియన్ల నాయకులు హైదబాద్‌లో డిప్యూటీ సెంట్రల్ లేబర్ కమిషనర్ శ్రీనివాసులు నేతృత్వంలో సింగరేణి, పవర్‌మేక్ కంపెనీ అధికారులతో మంగళవారం చర్చలు జరిపారు. ప్రధానంగా ఎన్టీపీసీ తరహాలో ఎస్టీపీపీ కార్మికులకు కూడా డస్టు అలవెన్స్ ఇవ్వాలని, పనికి తగిన వేతనం చెల్లించాలని, లాభాల్లో బోనస్‌గా రూ.5 వేలుచెల్లించలని కోరారు. కార్మికులకు కనీస సౌకర్యాల కల్పించాలని, క్యాంటీన్‌ను మెరుగుపర్చి సబ్సిడీపై నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. హెచ్ఎంఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, ఎస్టీపీపీ జనరల్ సెక్రెటరీ విక్రమ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ చిప్పకుర్తి సంపత్, సాయికృష్ణారెడ్డి, ఆర్గనైజింగ్‌సెక్రెటరీ నవీన్, ఎస్టీపీపీ బీఎంఎస్ జనరల్ సెక్రెటరీ దుస్స భాస్కర్ పాల్గొన్నారు.

కుష్ఠు నివారణకు చర్యలు

బజార్‌హత్నూర్: కుష్ఠు రహిత సమాజం కోసం క్షేత్ర స్థాయిలో పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని కుష్ఠు నివారణ శాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ జాన్‌బాబు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు కుష్ఠు నివారణపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చర్మంపై లేత గులాబీ రంగు, రంగు మారిన మచ్చలు స్పర్శ లేకుండా ఉన్నట్లైతే వెంటనే రోగ నిర్ధారణ పరీక్షలు చేయించాలన్నారు. లక్షణాలను ప్రాథమిక దశలో గుర్తించి ఎండీటీ చికిత్స అందించినట్లయితే వ్యాధి పూర్తిగా నయం అవుతుందన్నారు. డీపీఎంవోలు సకల్‌రెడ్డి, వెంకటేశ్వరచారి, శ్రీనివాస్, డీఎస్‌వో సురేందర్, మెడికల్ ఆఫీసర్ భీంరావ్ పాల్గొన్నారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య



గుర్తు తెలియని వ్యక్తి (ఫైల్)

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి(28) మంగళవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్‌పీ ఎస్సై మహేందర్ తెలిపారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని పేర్కొన్నారు. వ్యక్తి చామన ఛాయ, 5 అడుగుల ఎత్తు, బ్లూ కలర్ రెడీమెడ్ షర్ట్, బ్లాక్ కలర్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడు. ఓ యువతితో కలిసి దిగిన ఫొటో లభించిందని పేర్కొన్నారు. ఫొటోపై మై లవ్లీ అని రాసి ఉందని తెలిపారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచినట్లు వెల్లడించారు. వివరాలకు 8712658596, 9849058691 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పురుగుల మందు తాగి కూలీ..

దహెగాం(సిర్పూర్): మండలంలోని హత్తిని గ్రామంలో పురుగుల మందు తాగి చిట్ల కోటయ్య (58) అనే కూలీ ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కోటయ్య బతుకుదెరువు కోసం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా నుంచి 25 సంవత్సరాల క్రితం వలస వచ్చి హత్తినిలో స్థిరపడ్డాడు. ఇరవై ఏళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నా తగ్గకపోవడంతో ఈ నెల 20న భార్య మేకలు మేపేందుకు వెళ్లిన సమయంలో పురుగుల మందు తాగాడు. భార్య ఇంటికి వచ్చిన తర్వాత గమనించి బెల్లంపల్లికి తరలించింది. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి మంచిర్యాలకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ అతడు సోమవారం మృతి చెందాడు. భార్య సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై తెలిపారు.

మనస్తాపంతో ఒకరు..

నిర్మల్‌రూరల్: మండలంలోని అనంతపేట గ్రామానికి చెందిన పోలీసు భూమన్న (41) మనస్తాపంతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. సోమవారం ఉదయం భూమన్న పొలానికి యూరియా చల్లుతానని చెప్పి బయటకు వెళ్లాడు. రాత్రి వరకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకగా మామిడి తోటలో ఉరేసుకుని కనిపించాడు. మృతుని పెద్ద కుమారుడు గతంలో ప్రమాదవశాత్తు ఓ భవనం పైనుంచి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం అప్పులు చేశాడు. తీర్చేమార్గంలేక మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎంబీబీఎస్ ఫస్టియర్ ఫలితాల్లో 90శాతం ఉత్తీర్ణత

ఆదిలాబాద్‌టౌన్: ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం ఫలితాల్లో రిమ్స్ మెడికోలు 90 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. 2023 బ్యాచ్‌కు సంబంధించి 121 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 108 మంది ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. ఇందులో ఇద్దరు డిస్టింక్షన్, 49 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు తెలిపారు.